క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అచ్చంపేట రూరల్: మండలంలోని హాజీపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని 33కేవీ నడింపల్లి విద్యుత్ లైను మరమ్మతు కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఆంజనేయులు తెలిపారు. హాజీపూర్, బుడ్డతండా, సింగారం, ఎద్దుమిట్టతండా, అంకిరోనిపల్లి, చెన్నారం, రాయిచెడ్ గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. రైతులు, వినియోగదారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

చారకొండ: మండలంలోని జూపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని జూపల్లి, తిమ్మాయిపల్లి, జేపల్లి గ్రామాలు, పరిధిలోని తండాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు శుక్రవారం ఏఈ జానకిరామ్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అక్రమంగా ఇసుకను తరలించొద్దు

తాడూరు: అక్రమంగా ఇసుకను తరలించొద్దని తహసీల్దార్ ప్రమీళ పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని మేడిపూర్, పాల్మూరు, గుట్టలపల్లి, ఆకునెల్లికుదురు, శిర్సవాడ గ్రామాలను అనుసరించుకొని ఉన్న దుందుబీ వాగులోనుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు. ప్రస్తుతం కొత్తగా ఎవ్వరికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని వివరించారు.

దుస్తుల తయారీపై శిక్షణ

తాడూరు: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫాం తయారీని మహిళా సంఘాలకు అప్పజెప్పిన నేపథ్యంలో ఆయా బాలబాలికలకు ఏకరూప దుస్తువుల తయారీపై మహిళా సంఘాలకు శిక్షణ ఇచ్చారు. మండలంలో 37 ప్రాథమి పాఠశాలలు, 7 ఉన్నత పాఠశాలలకు సంబంధించిన మొత్తం 2929 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున ఏకరూప దుస్తువుల తయారీ అప్పగించినట్లు ఏపీఎం శేఖర్ తెలిపారు.

భూమిని కేటాయించాలని వినతి




కొల్లాపూర్ రూరల్: మండలంలోని కుడికిల్ల గ్రామానికి చెందిన పాలమూరు-రంగారెడ్డి నిర్వాసిత మాదిగలు తమ కాలనీకి సమీపంలో ఉన్న పట్టాభూమిని కొనుగోలు చేసి ఇండ్ల స్థలాలకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తు శుక్రవారం స్థానిక తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామ ఎంపీటీసీ కోండ్ర బిచ్చయ్య, దండోరా రాష్ట్ర నాయకులు బచ్చలకూర స్వామి మాట్లాడుతూ ప్రభుత్వం భూమిని కొనుగోలు చేసి ప్రాజెక్టులో భూములు కోల్పోయిన మాదిగలకు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నిర్వాసిత మాదిగలు జంగం రాముడు, పరమేష్, వినోద్ పకీరయ్య, కన్నయ్య, దేవమ్మ, ఎల్లమ్మ, రాముడు, శేఖర్, బాలపీరు, కృష్ణయ్య, నాగేశ్వరావు, తదితరులు ఉన్నారు.

పండ్ల తోటల పెంపకంపై అవగాహన

వెల్దండ: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి అధ్యక్షతను పండ్ల తోటల పెంపకంపై కార్యదర్శులకు, టెక్నికల్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పండ్ల తోటలకు అనుకూలంగా ఉన్న వ్యవసాయ పొలాలను గుర్తించాలన్నారు. తోటల పెంపకానికి కనీసం 5 ఎకరాల వ్యవసాయ భూమి, నీటి సౌకర్యం, జాబ్ కార్డు కల్గి ఉండాలన్నారు. అసక్తిగల రైతులు వ్యవసాయ అధికారులతో భూమి యొక్క సారవంతమైన వివరాలను నమోదు చేయించాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో 5200 మొక్కలను నాటించడానికి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ సునీత, ఏపీఓ ఈశ్వర్‌జీ, ఈసీ దేవేందర్‌గౌడు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కారు, బైక్ ఢీ: ఒకరికి గాయాలు



వెల్దండ: మండల కేంద్రంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై శుక్రవారం కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలైన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం చెర్కూర్ గ్రామానికి చెందిన మంగలి రమేష్‌కు బైక్‌పై కల్వకుర్తి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో వెల్దండ సమీపంలో కారు బైక్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో గాయపడటంతో చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వెల్దండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

నిబంధనలు ఉల్లంఘించొద్దు



వెల్దండ మండలం చొక్కన్నపల్లిలో..



పెద్దకొత్తపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి

నాగర్‌కర్నూల్‌రూరల్: నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి ఎం చంద్రశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం జిల్లాలోని విత్తన, ఎరువుల డీలర్లకు పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. నాలుగు డివిజన్ల డీఈఓలు, 20 మండలాల ఏఓలు, 438 విత్తన డీలర్లు హాజరయ్యారు. విక్రయాలకు సంబంధించి రైతులకు రశీదులు అందించాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో 5 లక్షల 47 వేల పత్తివిత్తన ప్యాకెట్లు, 35 వేల క్వింటాళ్ల వరి, 11 వేల క్వింటాళ్ల మొక్కజొన్న, 4000 క్వింటాళ్ల కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. జిల్లాలో 17 వేల టన్నుల యూరియా, 2000 టన్నుల డీఏపీ, 5714 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 227 టన్నుల పోటాష్, 661 టన్నుల సూపర్ ఎరువులు అందుబాటులో ఉన్నారయన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బల్మూర్: మండలంలోని అన్ని గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు విత్తనాల కొనుగోలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పత్తి విత్తనాలు లైసెన్సు కలిగిన ఏదైనా డీలర్ వద్దనే కొనాలని, కొనుగోలు చేసిన విత్తనాలకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

చారకొండ: మండలంలోని సిర్సనగండ్లలో వ్యవసాయ విస్తరణ అధికారి వంశీ రైతువేదిక కార్యాలయంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. సమావేశంలో రైతులు ఉన్నారు.

వెల్దండ: మండలంలోని చొక్కన్నపల్లి, పెద్దాపూర్ గ్రామాల్లో రైతులకు పంటల సాగుపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు అనుమానం వస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈఓలు సురేష్‌గౌడు, గణేష్, రైతులు తదితరులు ఉన్నారు.

పెద్దకొత్తపల్లి: అధికారుల సూచనలు, సలహాలు రైతులు పాటించాలని ఏఈఓ ముజీబ్ అన్నారు. మండల కేంద్రంలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.

పొగాకును నిషేధిద్దాం



మన్ననూరు పీహెచ్‌సీ ఎదుట ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది, గ్రామస్తులు

బిజినేపల్లి: మండంలోని పాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం పొగాకుకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ నిర్వహించిన్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డా. మాధురి అన్నారు. పొగాకు తీసుకోవడం వలన కలిగే నష్టాలు వివరించారు. పొగాకుతో క్యాన్సర్, గుండె జబ్బులు, శ్వాస సంబంధ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యాధికారి సాయిరాం గౌడు తెలిపారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది బాదం రాజేశ్వర్, లీలావతి, సుజాత, సుకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మన్ననూర్: పొగాకు, గుట్కా, పాన్ మసాలాలకు దూరంగా ఉండాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకుడు సత్యనారాయణ కోరారు. శుక్రవారం మన్ననూర్‌లోని పీహెచ్‌సీ ఆవరణలో వైద్య సిబ్బంది, గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వం



పాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో

వీటి తయారీ, అమ్మకాలను పూర్తిగా నిషేధించిందని వివరించారు. గ్రామంలో నిషేధిత గుట్కాలు విక్రయిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు గౌతం, జాన్సన్, సూపర్‌వైజర్ మార్థమ్మ, సిబ్బంది రామలింగమ్మ, నిర్మల, బీజీ తదితరులు పాల్గొన్నారు.

ఆశవర్కర్లకు పరీక్ష నిర్వహించొద్దు



కలెక్టర్ ఏఓ హనుమంతునాయక్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఆశవర్కర్లు

నాగర్‌కర్నూల్‌రూరల్: ఆశవర్కర్లకు పరీక్ష నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవద్దని కోరుతూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు శుక్రవారం ఏఓ హనుమంతునాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశవర్కర్లు 20 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారని ఇప్పటికే అనేక శిక్షణలు పొందారని పేర్కొన్నారు. వారికి పరీక్షలు నిర్వహించడం సరికాదని తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు పొదిల రామయ్య, కోశాధికారి అశోక్, శ్రీదేవి, సువర్ణ, పార్వతమ్మ, గౌరమ్మ, నిర్మల, జ్యోతి, వకులాదేవి, మానిక్యమ్మ, పద్మ, బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో యూనిఫాంలు అందించాలి

అమ్రాబాద్: సకాలంలో యూనిఫాం అందివ్వాలని డీపీఎం గోరటి లక్ష్మయ్య సూచించారు. మండల కేంద్రంలో మహిళా స్వశక్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూనిఫామ్ సెంటర్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ పాఠశాలలకు సంబంధించిన 2034 మంది విద్యార్థులకు మొదటి విడతగా యూనిఫాం సిద్ధం చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 500 మంది యూనిఫాంలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. పాఠశాలలు ప్రారంభనాటికి పూర్తిస్థాయిలో యూనిఫాం కుట్టాలని నిర్వాహకులకు సూచించారు.



టైలర్లతో మాట్లాడుతున్న డీపీఎం లక్ష్మయ్య

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

ఉప్పునుంతల: అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు ఉంటుందని, ప్రజల నుంచి మన్ననలు పొందుతారని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక కొత్త యశోద ఫంక్షన్ హాల్‌లో ఎంపీపీ తిప్పర్తి అరుణ నర్సింహ్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తొమ్మిదేళ్ల పాటు ఒకే మండలంలో ఎంపీడీఓగా సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. అనంతరం ఎంపీడీఓ దంపతులను సన్మానించారు. జెడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపీడీఓ లక్ష్మణ్‌రావురావు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

సీసీ నిర్మించారు.. కాల్వలు మరిచారు



జేపల్లిలో సీసీ రోడ్డుపై నిలిచిన నీరు

చారకొండ: మండలంలోని జేపల్లిలో సీసీ రోడ్డు నిర్మించారు కాని పక్కన కాల్వలు నిర్మించడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించారు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా సీసీ రోడ్డుపైనే నీరు నిల్వ ఉంటోంది. పూర్తి స్థాయిలో నిధులు మంజూరు అయినా కాంట్రాక్టర్ బిల్లులు తీసుకొని చేతులెత్తేశారు. గ్రామస్తులు సీసీ రోడ్డుపై ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మున్సిపల్ చైర్ పర్సన్‌కు సన్మానం



పెద్దకొత్తపల్లి: మున్సిపాలిటీ నూతన చైర్ పర్సన్‌గా మేకల రమ్యానాగరాజు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలో మండల కాంగ్రెస్ నాయకులు ఆమెను కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేకల గౌరమ్మ చంద్రయ్య, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్‌లు వెంకటేశ్వర్‌రెడ్డి, రమేష్ రావు, దండు నర్సింహ, గడ్డిగోపుల ఎల్లయ్య, ఎంపీటీసీలు రవికుమార్, శశికళశివశంకర్, సలీం, మల్లయ్య పాల్గొన్నారు.

జాయింట్ డైరెక్టర్‌గా ఆరీఫ్



కల్వకుర్తిరూరల్: గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్‌గా కల్వకుర్తి ప్రాంతానికి చెందిన సామాజిక వేత్త విద్యార్థి ఉద్యమ నాయకుడు ప్రగతి ఫౌండేషన్ అధ్యక్షుడు ఆరీఫ్ ఎన్నికయ్యారు. పది సంవత్సరాలుగా సామాజిక సేవ, వ్యక్తిత్వ వికాసం, సమాచార చట్టం, మానవ హక్కులు, యువజన మహిళా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ మేరకు ఆయన సేవలను యూనివర్సిటీ గుర్తించి జాయింట్ డైరెక్టర్ అవకాశం ఇచ్చారు. బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని శుక్రవారం ఆయన విలేకరులతో పేర్కొన్నారు.


రిటైర్డ్ పోస్టుమాస్టర్‌కు ఘన నివాళి

కొల్లాపూర్: రిటైర్డ్ పోస్టుమాస్టర్ పుట్టపాగ సిద్ధన్న(65) శుక్రవారం గుండెపోటుతో మరణించారు. కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల్లో సుదీర్ఘ కాలం పోస్టుమాస్టర్‌గా సేవలు అందించారు. సిద్ధన్న మృతిపై ఎమ్మార్పీఎస్‌తో పాటు పలు రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు సంతాపం ప్రకటించారు.

ఎంపీ రాములు పరామర్శ

కల్వకుర్తిరూరల్: మండలంలోని గుండూరు గ్రామానికి చెందిన ఎల్లమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు పోతుగంటి రాములు గుండూరుకు వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. అన్నివిధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం అంత్యక్రియలో పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు



వెల్దండ: మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకుంటునట్లు ఏపీఓ ఈశ్వర్‌జీ పేర్కొన్నారు. శుక్రవారం వాటరింగ్ డే సందర్భంగా ఆయా గ్రామాల్లో వాటర్ ట్యాంకర్ల ద్వారా ఉపాధి హామీ కూలీలతో నీరు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నాటిన మొక్కలను రక్షించడానికి కృషి చేస్తున్నామన్నారు. నర్సరీలల్లో పెంచుతున్న మొక్కలకు ఎండతీవ్రత నుంచి కాపాడుకోవానికి గ్రీన్‌నెట్ వేసినట్లు తెలిపారు.

కార్మికుల హక్కుల కోసం పోరాడుదాం



మాట్లాడుతున్న పుట్ట ఆంజనేయులు

తెలకపల్లి: కార్మికుల హక్కుల కోసం పోరాడుదామని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు పుట్ట ఆంజనేయులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని యోగాభవనంలో సీఐటీయూ జిల్లా స్థాయి శిక్షణ శిబిరాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. సరళీకృత ఆర్థిక విధానాలు, వివిధ రాజకీయ పార్టీల వైఖరీని వివరించారు. దేశంలో ఉన్న కోటి మంది స్కీం వర్కర్‌లతో వెట్టి చాకిరి చేయిస్తూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వకుండా వారిని శ్రమదోపిడీకి గురిచేస్తుందని విమర్శించారు. కార్మిక సంఘాలను కలుపుకొని ఐక్య పోరాటం చేద్దామన్నారు. కార్యక్రమంలో జిల్లా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు బి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు వర్ధం పర్వతాలు, సహాయ కార్యదర్శి పొదిలి రామయ్య, మల్లేష్, అశోక్, శివరాములు, గోపస్ లక్ష్మన్, విజయ్‌గౌడ్, రామకృష్ణ, చంద్రకళ, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, కార్మికులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు అరికట్టాలి



మాట్లాడుతున్న పరశురాములు

తెలకపల్లి: దళితులపై దాడుల అరిట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్జాల పరశురాములు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో కేవీపీఎస్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో దళితులపై దాడులు పెరిగాయన్నారు. దాడులను అరికట్టడానికి జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ పునర్ నియామకం చేయాలన్నారు. కొన్ని రోజుల కిందట బిజినేపల్లి మండలంలో కానాపూర్ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి కట్టిన తోరణాలను తొలగించారన్నారు. అదేవిదంగా మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ వెంకటయ్య పోలీసుల ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న, జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు సురిగిరి హనుమంతు, బొల్లె జగన్, మల్లేష్, నందిపేట భాస్కర్, సత్యనారాయణ, కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చింత ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఇంజనీరింగ్ విభాగంలో భర్తీ చేసే బీ కేటగిరి సీట్లను కౌన్సెలింగ్ ద్వార భర్తీ చేయాలని బీఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కే రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల యజమానులు అధిక ఫీజులు వసూలు చేస్తూ దోపిడీ పాల్పడుతున్నారని ఆరోపించారు. మెరిట్ విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

మహిళ అదృశ్యం

అమ్రాబాద్: మహిళ అదృశ్యం ఘటనపై శుక్రవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ రమేష్ వివరాల ప్రకారం అచ్చంపేట మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన పాశెట్టి స్వాతి(24)తల్లి శివకళ, అత్త జయమ్మలతో కలిసి మన్ననూర్ ఆర్‌డీటీ ఆస్పత్రికి వెళ్లారు. బాత్‌రూంకు వెళ్లొస్తానని చెప్పి స్వాతి బయటకు వెళ్లింది. ఎంతకీ తిరిగిరాకపోవడంతో ఆమె భర్త పాపిశెట్టి శ్రీను ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి

బిజినేపల్లి: నాగర్‌కర్నూల్ కోర్టు ఆవరణలో నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ నాగశేఖరరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మే 31వ తేదీ నుంచి జూన్ 8వ తేదీ వరకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భార్యభర్తల కేసులు, భూతగాదాలు, రోడ్డు ప్రమాదాలు వంటి వాటిపై రాజీ పడవచ్చని వివరించారు. సమాచారం కోసం సెల్: 9440170050 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రానికి చెందిన ఫొటో స్టూడియో ఎల్లయ్య భార్య జ్యోతి ఇటీవల మృతి చెందింది. కాంగ్రెస్ నాయకుడు డా. పి శ్రీనివాస్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు.

తండాల్లో ఎక్సైజ్ పోలీసుల దాడులు



పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండా, శాగాపూర్‌తండాల్లో శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి 37 లీటర్ల సారా, 427 కిలోల నల్లబెల్లం స్వాధీనం చేసుకొని ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ సారా తయారీ నిషేధం కోసమే దాడులు నిర్వహిస్తున్నామని, సారా తయారీని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేదన్నారు. సారా తయారీదారులు ప్రభుత్వం కల్పించే ఉపాధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తయారీదారులపై కేసులు నమోదు చేస్తామని, పద్ధతి మార్చుకోకపోతే పీడీయాక్టు అమలు చేస్తామన్నారు. ఆయా తండాల్లో బెల్లం పాకంను ధ్వంసం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. తెల్లరాళ్లపల్లితండాలో కేతావత్ కైక, ముడావత్ లక్ష్మి, ముడావత్ హన్మి, ఇస్లావత్‌బాబీ, ఇస్లావత్ బొజ్జమ్మ, శాగాపూర్‌తండాలో నేనావత్ శంకర్, నేనావత్ లాలుపై కేసులు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. తండాలో దాడులు నిర్వహిస్తున్నారని తెలిసి చాలా మంది ఇళ్లకు తాళాలు వేసుకుంటే వారి సమక్షంలో తాళాలు తీశాము తప్పా ఎక్కడ ధ్వంసం చేయలేదని సీఐ తెలిపారు. ప్రభుత్వ అదేశాల మేరకు దాడులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కొత్తకోట సీఐ కరుణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బాలకృష్ణారెడ్డి, డీటీఎఫ్ ఎస్‌ఐ విశ్వనాథం, ఎస్‌ఐలు సంధ్యారాణి, కృష్ణకాంత్, సృజనకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం విక్రయదారులపై కఠిన చర్యలు

గ్రామాల్లో చాలా మంది కిరాణం షాపుల వారు బెల్లం విక్రయం మానుకోవాలని, లేనిచో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కిరాణం షాపుల్లో నల్ల బెల్లం విక్రయంతోనే తండాల్లో సారా తయారీ జరుగుతుందని పేర్కొన్నారు.

క్రీడల్లో రాణించాలి



కొల్లాపూర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి వి.సీతారాం అన్నారు. ముదిరాజ్ కమ్యూనిటీ భవనం వద్ద ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. శిక్షణ పొందిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఆయన వెంట పీఈటీలు కుమారస్వామి, ప్రతాప్‌సింగ్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కల్వకుర్తి: డిపో పరిధిలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డిపో మేనేజర్ సుభాషిణి అన్నారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి 20 మంది ప్రయాణికులు వారి సలహాలు, సూచనలు చేశారు. బస్సుల సంఖ్యను పెంచాలని, బస్సులను సకాలంలో నడిపించాలని పలువురు కోరారు. ప్రయాణికులు ఇచ్చిన సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకొని వాటి పరిష్కారం దిశగా చూస్తామని డిపో మేనేజర్ తెలిపారు. కార్యక్రమంలో డిపో ఎస్టీఏ శ్వేత, ఉద్యోగ సంఘం నాయకులు సురేందర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీను



నియామక పత్రాన్ని అందుకుంటున్న శ్రీను

కల్వకుర్తి టౌన్: కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా కల్వకుర్తికి చెందిన శ్రీను నియమితులయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ నియామకపత్రాన్ని అందజేశారు. విద్యార్థుల సమస్యలపై నిత్యం పోరాటం చేస్తానని, నియామకానికి సహకరించిన డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రేపు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట జూన్ 2వ తేదీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీకాంత్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జాతీయ జెండావిష్కరణ ఉంటుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలు శిక్ష

బిజినేపల్లి: ఈ నెల 25న మండల కేంద్రంలో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. నందివడ్డేమాన్ గ్రామానికి చెందిన మ్యాతరి వెంకన్న పట్టుబడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని నాగర్‌కర్నూల్ కోర్టు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రమణయ్య ఎదుట హాజరపర్చారు. రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.2100 జరిమానా విధించినట్లు ఎస్‌ఐ నాగశేఖరరెడ్డి తెలిపారు.